## జకోవిచ్కు యూఎస్ ఓపెన్ సింగిల్స్ టైటిల్

యూఎస్ ఓపెన్ టెన్నిస్ పురుషుల సింగిల్స్ టైటిల్ను సెర్బియా ఆటగాడు నోవాక్ జకోవిచ్ గెలుచుకున్నాడు. న్యూయార్క్లో సెప్టెంబర్ 10న జరిగిన ఫైనల్లో అర్జెంటీనాకు చెందిన యువాన్ మార్టిన్ డెల్ పోట్రో పై 6-3, 7-6 (7/4), 6-3 సెట్ల తేడాతో విజయం సాధించాడు. ఇది జకోవిచ్కు మూడో యూఎస్ ఓపెన్ టైటిల్ కాగా కెరీర్లో 14వ గ్రాండ్స్లామ్ టైటిల్. విజేతకు రూ.27 కోట్ల 40 లక్షలు (38 లక్షల డాలర్లు); రన్నరప్ రూ.13 కోట్ల 34 లక్షలు(18 లక్షల 50 వేల డాలర్లు) ప్రైజ్మనీ లభించింది.

ఎనిమిదో సారి యూఎస్ ఓపెన్ ఫైనల్ ఆడిన జకోవిచ్ ఈ విజయంతో అమెరికాకు చెందిన పీట్ సంప్రాస్ రికార్డును సమం చేసి మూడో స్థానంలో నిలవగా 20 గ్రాండ్స్లామ్ టైటిళ్లతో ఫెడరర్, 17 విజయాలతో రఫెల్ నాదల్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. 1968 తర్వాత యూఎస్ ఓపెన్ టైటిళ్లను మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు గెలిచిన ప్లేయర్లలో జకోవిచ్ ఏడోవాడు. ఇప్పటివరకు ఫెడరర్, జిమ్మీ కానర్స్, పీట్ సంప్రాస్ 5 సార్లు, జాన్ మెకన్రో 4 సార్లు, ఇవాన్ లెండిల్, రఫెల్ నాదల్, జకోవిచ్లో మూడు సార్లు యూఎస్ ఓపెన్ టైటిళ్లు గెలుచుకున్నారు.

యూఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిల్ను 3-6, 7-6 (7-2), 7-6 (8-6) తేడాతో టిమియా బాబోస్ (హంగేరి), క్రిస్టినా మ్లదనోవిచ్ (ఫ్రాన్స్) పై గెలిచి అష్లీ బార్టీ (ఆస్ట్రేలియా), కోకో వాండెవె (అమెరికా) జోడి సొంతం చేసుకుంది.

## గోకుల్చాట్ బాంబు పేలుళ్ల దోషులకు ఉరిశిక్ష

హైదరాబాద్లోని గోకుల్చాట్, లుంబినీ పార్కుల్లో బాంబు పేలుళ్లకు పాల్పడిన ఇండియన్ ముజాహుద్దీన్ (ఐఎం) ఉగ్రవాదులు అనీక్ షఫీక్ సయీద్, మహమ్మద్ అక్బర్ ఇస్మాయిల్ చౌదరీలకు కోర్టు ఉరిశిక్ష విధించింది. వారికి సహకరించినందుకు తారిఖ్ ఎహ్సన్కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రెండో అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ఐపీసీ సెక్షన్ 302, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక)చట్టాల కింద ఈ కేసులో ఇద్దరిని దోషులుగా, మరో ఇద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ సెప్టెంబర్ 4న తీర్పు వెలువరించిన న్యాయస్థానం సెప్టెంబర్ 10న ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పును హైకోర్టు ఖరారు చేయాల్సి ఉంటుంది.

2007 ఆగస్టు 25న హైదరాబాద్లోని లుంబినీ పార్కు, గోకుల్చాట్లలో ఉగ్రవాదులు చేసిన బాంబు దాడిలో 44 మంది చనిపోయారు. ఈ కేసును అప్పటి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు అప్పగించింది. హైదరాబాద్ పాతబస్తీలోని మక్కా మసీదులో 2007 మే 18న జరిగిన బాంబు పేలుళ్లకు ప్రతీకారంగా ఈ దాడులు జరిపామని దోషులు అంగీకరించారు. 2013 ఫిబ్రవరిలో దిల్సుఖ్నగర్లో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనపై విచారణ కొనసాగుతుంది.

## అమెరికాలో ఫ్లోరెన్స్ తుఫాను

అమెరికా తూర్పు తీరంలోని అట్లాంటిక్ మహా సముద్రంలో ఫ్లోరెన్స్ అనే హారికేన్ సంభవించింది. దీంతో దక్షిణ, ఉత్తర కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అట్లాంటిక్ సముద్రంలో 1100 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్న ఫ్లోరెన్స్ కేటగిరీ 4 గా మారి మూడు నాలుగు రోజుల్లో తీరాన్ని తాకుతుందని నేషనల్ హారికేన్ సెంటర్ హెచ్చరించింది. దీని వల్ల బలమైన ఈదురుగాలులు, వర్షాలు, వరదలు సంభవిస్తాయని, కొండచరియలు విరిగి పడతాయిని తెలిపింది. లమెరికాలో సంభవించే తుపాన్లను హారికేన్లు అంటారు.

## గాల్లోనే ఇంధనం నింపుకొని తేజస్ అరుదైన రికార్డు

గాల్లోనే ఇంధనం నింపుకోవడంతో తేలికపాటి యుద్ధ విమాన తేజస్ (Tejas MK-1) అరుదైన రికార్డు సాధించింది. గంటకు 500 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ సుమారు 1900 కేజీల ఇంధనాన్ని నింపుకోవడంతో ఈ సాంకేతికత కలిగిన అతి తక్కువ దేశాల సరసన చేరింది. భూమికి 20 వేల అడుగుల ఎత్తులో ఐఏఎల్-78 ఎంకే-1 అనే ఆయిల్ ట్యాంకర్ విమానం నుంచి ఇంధనం నింపుకుంది. హెచ్ఇఏఎల్ (పూర్తి స్వదేశీ పరజ్ఞానం) తయారు చేసిన తేజస్ ఇటీవలే ట్యాంకర్ విమానంతో గాల్లో డాకింగ్ (అనుసంధానం) ప్రక్రియను పూర్తి చేసుకుంది. తాజాగా ఇంధనం నింపుకునే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో దీనికి ఆపరేషనల్ క్లియరెన్స్ ఇవ్వనున్నారు. 123 Tejas MK-1 యుద్ధవిమాల తయారీకి ఇండియన్ ఎయిర్ఫోర్స్ 50 వేల కోట్ల కాంట్రాక్టును హెచ్ఏఎల్ కు అప్పగించింది.

## ఆలీబాబా చైర్మన్గా డేనియల్ జాంగ్

చైనాకు చెందిన ఈ-కామర్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్గా డేనియల్ జాంగ్ నియమితులు కానున్నారు. జాంగ్ 2019 సెప్టెంబర్ 10న బాధ్యతలు చేపడతారు. ప్రస్తుత చైర్మన్, ఆలీబాబా వ్యవస్థాపకుడు జాక్మా తన 54వ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 10న కొత్త చైర్మన్గా డేనియల్ పేరు ప్రదిపాదించాడు. ఆలీబాబా.కామ్ అనేది చైనాలో అతిపెద్ద ఆన్లైన్ మార్కెట్ నిర్వహిస్తున్న వెబ్సైట్. దీని మార్కెట్ విలువ సుమారు 420 బిలియన్ డాలర్ల అంటే రూ.30,43,131 కోట్లు. డేనియల్ సింగిల్ డే సేల్ పేరుతో నిర్వహించిన  ఈ కామర్స్ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచింది.

## మంగోలియాలో నొమాడిక్ ఎలిఫెంట్ 2018

భారత్మంగోలియా సంయుక్త సైనిక విన్యాసాలు Nomadic Elephant-2018 మంగోలియా రాజధాని ఉలాన్బాటర్లో సెప్టెంబర్ 10న ప్రారంభమయ్యాయి. 12 రోజుల పాటు జరగనున్న ఈ విన్యాసాలు సెప్టెంబర్ 21 న ముగుస్తాయి. Nomadic Elephant అనేది భారత్మంగోలియాల మధ్య జరిగే సంయుక్త సైనిక విన్యాసాల పేరు. వీటిని ఇండియన్ ఆర్మీ, మంగోలియా ఆర్మ్డ్ ఫోర్సెస్ మధ్య సహకారం, బంధాన్ని బలోపేతం చేయడానికి 2006 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.

ఈ విన్యాసాల వల్ల ఆర్మీ బలగాలకు కావాల్సిన టాక్టికల్, టెక్నికల్ స్కిల్స్ మెరుగుపడటంతో పాటు ఉగ్రవాద, మిలిటరీ ఆపరేషన్స్ నిర్వహించడంలో శిక్షణ ఇస్తారు. ఈ ఎక్సర్సైజ్లో భారత్ నుంచి 17 పంజాబ్ రెజిమెంట్ పాల్గొనగా మంగోలియా నుంచి యూనిట్ 084 పాల్గొంటుంది.

## పుణెలో మిలెక్స్-18 సైనిక విన్యాసాలు

బిమ్స్టెక్ దేశాల సంయుక్త సైనిక విన్యాసాలు MILEX-18 పేరుతో పుణెలోని అంధ్ మిలిటరీ స్టేషన్లో సెప్టెంబర్ 10 న ప్రారంభమయ్యాయి. 16 వరకు జరగనున్న ఈ విన్యాసాల ప్రారంభ పరేడ్ను భారత్ కంటింజెంట్ కమాండర్ గౌరవ శర్మ ముందుండి నడిపించారు. బిమ్స్టెక్ దేశాల్లో ఉగ్రవాద ఆపరేషన్లను సమర్థంగా నిర్వహించేలా శిక్షణ ఇవ్వడంతో పాటు సాధన చేయడం MILEX-18 ఉద్దేశం. ఉగ్రవాద నిరోధానికి ఆర్మీ బలగాలకు కావాల్సిన టాక్టికల్, టెక్నికల్ స్కిల్స్ను ఇక్కడ సాధన చేయిస్తారు.

BIMSTEC: Bay of Bengal Initiative for Multi-Sectoral Technical and Economic Cooperation

BIMSTEC దేశాలు: India, Sri Lanka, Bangladesh, Bhutan, Nepal, Thailand, Myanmar

## విశాఖ పోర్టుకు గ్రీన్ ఎనర్జీ అవార్డు

ఇంధన వినియోగంలో అనుసరిస్తున్న విధానాలకు విశాఖ పోర్టుకు ఇండియా గ్రీన్ ఎనర్జీ అవార్డు లభించింది. సుమారు 58 కోట్లతో 10 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్ను నెలకొల్పి పోర్టు అవసరాలకు పోను మిగులు విద్యుత్ను విక్ర యిస్తున్నందు వల్ల 2018 సంవత్సరానికి ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ ఈ అవార్డును ప్రకటించింది.